ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

సోమవారం 19 ఫిబ్రవరి 2024 | 5



నేడు స్పందన

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 18: కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో జిల్లాస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అర్జీదారులు తమ సమస్యలను జిల్లా అధికార యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని కోరారు.



విద్యుత్ దీపాల వెలుగులు

కల్యాణం చూతము రారండి

బుగ్గన చుక్కతో సిగ్గులు ఒలకబోస్తూ నారసింహుడు, చక్కటి అలంకరణతో ఉభయ దేవేరులు పెండ్లి పీటలు ఎక్కే సమయం ఆసన్నమైంది. రథసప్తమి నాడు పెండ్లి కుమారుడిగా దర్శనమిచ్చిన అంతర్వేది లక్ష్మీనరసింహుడు సోమవారం రాత్రి ఉభయ దేవేరులను పరిణయమాడేందుకు సిద్ధమయ్యారు. అఖండ జన సందోహం నడుమ ప్రతి ఏటా మాఘమాసంలో స్వామివారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈ వివాహ వైభోగం చూసేందుకు రెండు కళ్లు చాలవు. ఆరుద్ర నక్షత్రయుక్త వృశ్చికలగ్న పుష్కరాంశమందు సోమవారం రాత్రి 12:29 గంటలకు (తెల్లవారితే మంగళవారం) కల్యాణం జరుగుతుంది.

వార్త..7లో





పుష్పాలంకరణ

రాష్ట్రంలోనే ఆరు బయట జరిగే కల్యాణ మహోత్సవంగా అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణం పేరుగాంచింది. దీంతో విద్యుత్ అలంకరణలతో పాటు పుష్పాలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రధాన గోపురం, ధ్వజస్తంభం, క్యూలైన్లు, కల్యాణ మండపం, రాజ్యలక్ష్మి అమ్మవారి ఉపాలయాలను వివిధ రకాల పుష్పాలతో ముస్తాబు చేశారు. ఈ పుష్పాలంకరణలు కల్యాణ మహోత్సవాలకు మరింత ఆకర్షణగా నిలుస్తున్నాయి.

పటిష్ట బందోబస్తు..ప్రత్యేక ఏర్పాట్లు

అంతర్వేది, ఫిబ్రవరి 18: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాలకు విచ్చేసే భక్తులు ఎటువంటి అసౌకర్యానికి గురి కాకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయ చైర్మన్ రాజా కలిదిండి కుమారరామగోపాల రాజా బహదూర్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్, డీఎస్పీ వెంకటరమణ మాట్లాడారు. కల్యాణోత్సవాల్లో అధికారులంతా ఆధ్యాత్మిక భావంతో సమన్వయంగా పనిచేయాలన్నారు. పద్దెనిమిది శాఖలతో కూడిన అధికారులంతా ఉత్సవాల్లో భక్తులకు సేవ లందిస్తారన్నారు. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎస్పీ చెప్పారు. ఐదుగురు ఎస్పీలు, ఎనిమిది మంది డీఎస్పీలు, 52 మంది సీఐలు, 280 మంది పోలీసు అధికారులు, 1600 సిబ్బందితో మొత్తం 1820 మంది ఉత్సవాల్లో భక్తులకు రక్షణ కల్పిస్తూ సేవ లందిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ వన్ వే రూట్‌లో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ఉత్సవాల్లో పాల్గొనాలని ఎస్పీ తెలిపారు. తాగు నీరు, పారిశుధ్యం, మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. కల్యాణోత్సవాల్లో కల్యాణం టిక్కెట్టు రూ.200, స్పెషల్ దర్శనం రూ.100లు పాత రేట్ల ప్రకారమే కౌంటర్ల వద్ద భక్తులకు అందుబాటులో ఉంటాయని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. అనంతరం కల్యాణ మహోత్సవ ముఖ్య ఘట్టాలైన కల్యాణ మండప ప్రదేశం, రథోత్సవం, చక్రస్నానం, తెప్పోత్సవం జరిగే ప్రదేశాలను ఎస్పీ పరిశీలించారు. ఉత్సవ ఏర్పాట్లు పూర్తయ్యాయని, మాఘమాసం విశేషమైన రోజుల్లో తీర్థ మహోత్సవాలు జరగడంతో అధిక సంఖ్యలో భక్తులు వస్తారని ఏసీ అన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎస్పీ శ్రీధర్ పోలీసు శాఖ, సిబ్బందితో ఉత్సవ ఏర్పాట్లపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆరు జిల్లాల నుంచి వచ్చిన పోలీసులకు బందోస్తు ఏర్పాట్లకు సంబంధించి ఆదేశాలు జారీ చేశారు. భద్రత కల్పించడంలో రాజీ పడకూడదన్నారు. కల్యాణ మహోత్సవం, రథోత్సవాల్లో పోలీసు శాఖ భక్తులకు సేవలందించాలన్నారు. డీఎస్పీ రమణ, సీఐ గోవిందరాజు, ఎస్ఐ రాము, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీధర్

చెక్కముక్కలే హద్దులు



జగనన్న ఇళ్ల స్థలాల వద్ద రాళ్లకు బదులు చెక్కలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 18: బడుగు,బలహీన వర్గాలకు అందిస్తున్న జగనన్న ఇంటి స్థలాల పంపిణీలో అధికారులు సరిహద్దు రాళ్లకు బదులుగా చెక్కముక్కలను పాతి మమా అనిపించారు. ఆదివారం ఆత్రేయపురంలో ఐదు గ్రామాల ప్రజలకు 11 ఎకరాలలో సుమారు 450 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పంపిణీకి చర్యలు చేపట్టారు. రెవెన్యూ యంత్రాంగం 1200 చెక్క ముక్కలకు రంగులు వేసి సరిహద్దురాళ్లుగా పాతి చేతులు దులుపుకుంది.. నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు సిమెంట్, గ్రానైట్ రాళ్లతో సరిహద్దులు నిర్ణయించి శాశ్వతంగా లబ్ధిదారులకు పట్టాలు అందించాల్సి ఉంది. ప్రభుత్వం రాయి ఒక్కంటికి రూ.100 చొప్పున అందిస్తున్నారు. శాశ్వతంగా నిలిచిపోయే రాళ్లను కాదని చెక్కముక్కలను పాతడంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు. దీంతో లక్షలాది రూపాయలు స్వాహా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే మండలంలోని జగనన్న ఇళ్ల స్థలాలకు సంబంధించి లబ్ధిదారుడికి సెంటున్నర స్థలం వంతున పంపిణీ చేయగా ఆత్రేయపురంలో సెంటు పావు చొప్పున పంపిణీ చేయడం ఎంతవరకూ సమంజసమని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. సెంటుపావు స్థలం ఒక కుటుంబం ఇంటి నిర్మాణానికి సరిపోతుందా అని ప్రశ్నిస్తున్నారు.

కొబ్బరి చెట్టును ఢీకొన్న బైక్

ఇద్దరు యువకుల దుర్మరణం 7లో

పంట కాల్వలోకి దూసుకెళ్లిన కారు

ఏడుగురిని రక్షించిన ఏఆర్ కానిస్టేబుల్ 7లో



బండారులంకలో నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణం



అసంపూర్తిగా నిలిచిపోయిన బాలికల టాయిలెట్లు

నాడన్నారు.. నేడన్నారు

(అమలాపురం రూరల్)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'నాడు-నేడు' పథకంలో రెండో విడతగా పాఠశాలలకు నిధులు మంజూరు చేసింది. ప్రజాప్రతినిధులు ఎక్కడికక్కడ అట్టహాసంగా శంకుస్థాపనలు చేశారు. గత ఏడాది మార్చి ప్రథమార్థంలో ప్రభుత్వం కొంత మేర నిధులు విడుదల చేసింది. అవి కొన్నింటికి సరిపోవడంతో మిగిలిన పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. జిల్లాలో ఏ పాఠశాలకు వెళ్లినా అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు, పునాదులు దశ దాటనివి దర్శనమిస్తున్నాయి. ఈ పథకం పనులపై ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నారు తప్ప నిధులు విడుదల చేయకపోవడంతో అసంపూర్తిగానే మిగిలిపోయాయని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 17: అమలాపురం రూరల్ ఎ.వేమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.83 లక్షలు మంజూరు చేశారు. 2022 సెప్టెంబరు 2న రెండో దశలో రూ.1.01 కోట్లతో వివిధ పనులకు మంత్రి పినిపే విశ్వరూప్ శంకుస్థాపన చేశారు. ఐదు అదనపు తరగతి గదుల నిర్మాణంతో పాటు ఇతర పనులు చేపట్టాల్సి ఉంది. ప్రభుత్వం రూ.25 లక్షలు విడుదల చేయడంతో కొద్దిపాటి పనులు చేసి అలాగే వదిలేశారు. గత ఏడాది మార్చి 14న ఈ నిధులు విడుదలయ్యాయని అప్పటి నుంచి ఇప్పటివరకు మిగతావి రాకపోవడంతో అదనపు తరగతి గదుల నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయాయి.



అసంపూర్తిగా వంట షెడ్డు



ఇందుపల్లిలో పునాదుల దశలోనే అదనపు తరగతి గదులు



ఎ.వేమవరంలో నేలకే పరిమితమైన తరగతి గదుల నిర్మాణం

> ఏడాదిగా విడుదల కాని నిధులు
> ఎక్కడికక్కడే నిలిచిన పాఠశాలల భవనాల నిర్మాణ పనులు
> అదిగో నిధులు..ఇవిగో నిధులు అన్నారు..
> క్షేత్రస్థాయిలో మాత్రం కదలని పనులు
> అసంపూర్తిగా బాలికల టాయిలెట్లు, వంటషెడ్ల నిర్మాణ పనులు
> అవసరానికి ఉపయోగపడని భవనాలు

పునాదుల దశలోనే పనులు

ఇందుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.1.30 కోట్లు మంజూరుకు సంబంధించి అప్పట్లో రూ.23 లక్షలు ఇచ్చారు. ఆరు అదనపు తరగతి గదులతో పాటు తొమ్మిది విభాగాల్లో ఇతర పనులు చేపట్టాల్సి ఉంది. వాటి నిర్మాణం పునాదుల దశలోనే నిలిచిపోతే ఇక బాలికల టాయిలెట్లు, వంటషెడ్ల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. బండారులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొలి విడత మంజూరైన పనులే ఇంతవరకు పూర్తికాలేదు. రెండో విడత మంజూరైన నిధులతో అసంపూర్తిగా అదనపు తరగతి గదుల నిర్మాణం దర్శనమిస్తోంది. అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోనూ అదే పరిస్థితి. ఇలా జిల్లాలో ఏ పాఠశాలకు వెళ్లినా అసంపూర్తి నిర్మాణాలే దర్శనమిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి నిధుల విడుదలకు కృషి చేసి భవనాల నిర్మాణం పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



భలే మంచి రోజులు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 18: పల్లె పట్టణమన్న తేడా లేదు. ఎటు చూసినా.. ఎక్కడ చూసినా పెళ్లి సందడే. వరుసగా మూడు నెలల పాటు భాజాభజంత్రీల మోతే. వివాహాది శుభ కార్యక్రమాలతో పాటు నూతన గృహాల నిర్మాణానికి శంకుస్థాపనలు, గృహ ప్రవేశాల ముహూర్తాలు మెండుగా ఉన్నాయి. ఎక్కడ చూసినా పండుగ వాతావరణమే కనిపిస్తుంది. వివాహాది శుభ కార్యక్రమాలు నిర్వహించే పురోహితుల నుంచి కల్యాణ వేదికలు సిద్ధం చేసేవారు. వంటలు చేసేవారు, కేటరింగ్ సిబ్బంది ఇలా ఎన్నో వర్గాల వారికి క్షణం తీరిక లేకుండా ముహూర్తాలు ఒకేసారి ముంచెత్తాయి. ప్రతీ ఇంట శుభలేఖలే. ప్రస్తుత సీజన్‌లో శుభలేఖలు అందుకోని గృహం లేదంటే ఎంత మాత్రం అతిశయోక్తి కాదు. సంక్రాంతి పండుగ సీజన్ అనంతరం ఒకింత కుదేలైన వస్త్ర వ్యాపారం తిరిగి పుంజుకుంది. ఇక బంగారు నగలు వ్యాపారానికి ఊపొచ్చింది. ఏప్రిల్ 28 నుంచి మూఢం రావడంతో 70 రోజుల పాటు ముహూర్తాలకు బ్రేక్ పడినప్పటికీ ఆ తరువాత మళ్లీ ముహూర్తాల వెల్లువే ఉంది.

29న వెరీ స్పెషల్

ఫిబ్రవరి 29న బలమైన ముహూర్తం కావడంతో జిల్లా వ్యాప్తంగా వివాహాలు చేసుకునే వారి సంఖ్య ఎక్కువే. అయితే నాలుగేళ్లకోసారి వచ్చే 29వ తేదీన వివాహం చేసుకోవడమంటే మళ్లీ నాలుగేళ్ల తరువాతే ఆ దంపతులు పెళ్లిరోజు చేసుకునే పరిస్థితి. 29న వివాహం చేసుకునే వారికి అదే సంథింగ్.. సంథింగ్..



ముహూర్తాలు ఇవే..

వివాహాలతో పాటు గృహప్రవేశ, శంకుస్థాపనలతో పాటు అక్షరాభ్యాసాలకు సైతం ముహూర్తాలు ఉన్నాయి. ఈ నెల 21, 23, 24, 25, 26, 27, 28, 29 తేదీల్లో వరుసగా ముహూర్తాలు ఉన్నాయి. ఇక ఇదే నెలలో 28, 29 తేదీల్లో ఎక్కడ చూసినా వివాహాది శుభ కార్యక్రమాలే ఉన్నాయి. ఇక మార్చి 2, 12, 15, 17, 18, 19, 20, 22, 24, 25, 26, 27, 28, 29, 30 తేదీల్లోను, ఏప్రిల్ 1, 3, 4, 5 తేదీల్లో ముహూర్తాలున్నాయి. 9న ఉగాది పర్వదినం. మళ్లీ 12, 13, 15, 18, 20, 21, 22, 23, 24, 26 తేదీల్లో శుభ ముహూర్తాల వెల్లువే.

ఏప్రిల్ 28 నుంచి మళ్లీ బ్రేక్



శుభ ముహూర్తాల వెల్లువకు ఏప్రిల్ 28 నుంచి బ్రేక్ పడింది. ఆ రోజు నుంచి జూలై 11 వరకు శుక్రమూఢం ఉండగా మధ్యలో మే 3 నుంచి గురుమూఢం ప్రారంభమై జూన్ 2 వరకు ఉంది. ఆ తరువాత జూలై 8 నుంచి ఆగస్టు 4 వరకు ఆషాడమాసం కావడంతో 70 రోజుల పాటు వివాహాది శుభ కార్యక్రమాలకు బ్రేక్ పడింది. ప్రస్తుత సీజన్‌లో వివాహాది శుభ ముహూర్తాల వివరాలను ఈశ్వర పంచాంగకర్త కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతి వివరించారు.



అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

చూతము రారండి..



శ్రీలక్ష్మీనరసింహస్వామివారు

- నేడు రాత్రి 12:29 గంటలకు కల్యాణం
- భారీ బందోబస్తు ఏర్పాట్లు

అంతర్వేది, ఫిబ్రవరి 18: బుగ్గన చుక్కతో సిగ్గులు ఒలకపోస్తూ రథసప్తమినాడు పెళ్లి కుమారుడుగా దర్శనమిచ్చిన శ్రీ స్వామివారు సోమవారం రాత్రి ఉభయ దేవేరులను పరిణయమాడేందుకు సిద్ధమయ్యారు. పంచ భూతాల సాక్షిగా అఖండ జన సందోహం నడుమ ప్రతిఏటా మాఘమాసంలో కనుల పండువగా జరిగే శ్రీనారసింహుడి కల్యాణం చూసేందుకు రెండు కళ్లు చాలవు. కోరికలు తీర్చే శ్రీనారసింహుని పరిణయ వేడుక పదిరోజుల పాటు వైభవంగా జరుగుతుంది. ఆరుద్ర నక్షత్రయుక్త వృశ్చికలగ్న పుష్కరాంశమందు సోమవారం రాత్రి 12:29 గంటలకు(తెల్లవారితే మంగళవారం) కల్యాణం జరుగుతుంది.

కల్యాణ తంతు - ఎదురు సన్నాహం..

కల్యాణ కాంతులతో మెరుస్తున్న మేఘ వర్ణుడు శ్రీస్వామివారు. కల్యాణానికి సిద్ధపడుతూ తొలుత కంచు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు. తదుపరి పెళ్లి కుమారుడి తరపున ఆలయ అనువంశిక ధర్మకర్త మొగల్తూరు రాజ వంశీయులు, ఆలయ ఫ్యామిలీ ఫౌండర్ రాజా కలిదిండి కుమారరామగోపాల రాజాబహద్దూర్, పెళ్లి కుమార్తె తరపున అర్చక స్వాములు రాజా వారి వీధిలో ఎదురు సన్నాహాలు (ఒకరికొకరు బుక్కా చల్లుకోవడం) చేస్తారు. అనంతరం శ్రీవారి ఆలయం వద్దకు చేరుకుంటారు.

పల్లకీలో కల్యాణ వేడుకకు..

కల్యాణ మూర్తులైన శ్రీ స్వామివారు మేళ తాళాలు, మంగళ వాయిద్యాల మధ్య పల్లకీలో కల్యాణ మండపం వద్దకు చేరుకుని సింహాసనంపై ఆసీనులవుతారు. అనంతరం అమ్మవారు పల్లకీలో కల్యాణ మండపం వద్దకు చేరుకోవడంతో కల్యాణ తంతు ప్రారంభం అవుతుంది. ఆలయ స్థానాచార్యులు రంగాచార్యులు సమక్షంలో ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్ ఆధ్వర్యంలో కల్యాణ తంతును జరుగుతుంది.

రక్షాబంధనం: కల్యాణ కార్యక్రమంలో నియమ నిబంధనలను సక్రమంగా నిర్వహించమని వేదమంత్రాలతో సర్వతో రక్షించమని కోరుతూ అర్చక స్వాములు రక్షాబంధనం చేస్తారు.


గోదానం: పవిత్రమైన దర్భాలతో (కూర్చ) గోవుగా భావించి గోదాన మంత్రాలతో గోదానం నిర్వహిస్తారు.

శుభ ముహూర్తం: మాఘమాసంలో ఆరుద్ర నక్షత్రయుక్త వృశ్చిక లగ్న పుష్కరాంశమందు సోమవారంరాత్రి 12:29గంటలకు (తెల్లవారితే మంగళవారం) శ్రీ స్వామివారు, అమ్మవార్ల శిరస్సుపై జీలకర్ర, బెల్లం అర్చక స్వాములు చేత సమర్పిస్తారు.

కన్యాదానం: కొబ్బరి బొండం, గుమ్మడికాయ, గంధపుచెక్క, అరటిపండ్లు, శ్రీభూదేవిలను స్వామివారికి దానం చేస్తారు.

సువర్ణయజ్ఞోపవేత ధారణ: సువర్ణ యజ్ఞోపవేత ధారణ శ్రీ స్వామివారికి, శ్రీ భూదేవిలకు మంగళసూత్ర ధారణ నిర్వహిస్తారు.

ముత్యాల తలంబ్రాలు: పొలమూరి రాజుల సత్రం నిర్వాహకులచే సమర్పించబడిన మంచిముత్యాల తలంబ్రాలు ముందుగా అర్చక స్వాములు, స్థానాచార్యుల వారు, మొగల్తూరు రాజావారు, పొలమూరి రాజులు సమర్పిస్తారు.



మూలవరులు

బ్రహ్మముడి: అర్చక స్వాములచేస్వామి, అమ్మవార్లకు చమ్కీ దండలు, పూల దండలు సమర్పిస్తారు. అనంతరం ఆశీర్వచనాలు, మంగళ హారతి నిర్వహిస్తారు.

వార్షిక కల్యాణోత్సవ బంగారు ఆభరణాలు

కల్యాణోత్సవమూర్తులకు బంగారుఆభరణాలు ఇచ్చిన దాతలు అంతర్వేదికి చెందిన డాక్టర్ పోతురాజు సూర్యవెంకటసత్యనారాయణ, కుటుంబ సభ్యులు సమర్పించిన ఆభరణాలతో కల్యాణం జరుగుతుంది.



హంసవాహనంపై స్వామివారి గ్రామోత్సవం , స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా స్వామివారి గ్రామోత్సవాలు

అంతర్వేది, ఫిబవరి 18: అంతర్వేది కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 4గంటలకు అంతర్వేదిపాలెం వాస్తవ్యులు అల్లూరి లక్ష్మీసూర్యనారాయణరాజు వారిచే నిర్మించిన హంస వాహనంపై స్వామివారికి గ్రామోత్సవం జరిపారు. తొలుత స్వామివారిని అర్చక స్వాములు అలంకరణ చేసిన అనంతరం భక్తులు కొబ్బరికాయలు కొట్టి హారతులు పట్టారు. గ్రామ పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా సాయంత్రం 6.30 గంటలకు అర్చక స్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి వైభవంగా ధ్వజారోహణ నిర్వహించారు. గరుత్మంతుడు చిత్రపటాన్ని ధ్వజస్తంభంపై అర్చకులు ఎగురవేశారు. రాత్రి 8 గంటలకు కేశవదాసుపాలెం వాస్తవ్యులు గన్నాబత్తుల వెంకటరాజారావు లక్ష్మీనరసింహస్వామి వారిచే నిర్మితమైన శేషవాహనంపై గ్రామోత్సవం జరిపారు. స్వామివారికి భక్తులు హారతులు పట్టి ప్రత్యేకపూజలు చేశారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రామగోపాల రాజాబహద్దూర్, ఆలయ సహాయకమిషనర్ వి.సత్యనారాయణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, వలవల రాంబాబు, మందపాటి వెంకటేశ్వర్లు, వనమాలి మూలాస్వామి, ఉత్సవ సేవాకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవాల్లో నేడు...

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 5గంటలకు సుప్రభాతసేవ, 7గంటలకు అర్జిత అభిషేకం, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు, సాయంత్రం 4గంటలకు పంచముఖ ఆంజనేయస్వామి వాహనం, రాత్రి 8.30 గంటలకు కంచుగరుడ వాహనాలపై స్వామివారి గ్రామోత్సవాలు నిర్వహించబడతాయని ఆలయ సహాయక మిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

పురాతన ఆలయాలకు నూతనత్వం కల్పించాలి



భక్తులనుద్దేశించి అనుగ్రహ బాషణం చేస్తున్న చినజీయర్ స్వామి

- చారిత్రక నేపథ్యం పాడవకూడదు
- ఆచార్య శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి

కోరుకొండ, ఫిబ్రవరి 18: సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లుగా ఉన్న భారతదేశంలో పురాతన ఆలయాలకు నూతనత్వం కల్పించాలని ఈ సందర్భంలో ఆలయాలకు చారిత్రక నేపథ్యం పాడవకూడదని పరమహంస పరివ్రాజక ఆచార్య శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి అన్నారు. కోరుకొండలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు వచ్చిన ఆయన కొద్దిసేపు అనుగ్రహ భాషణం చేశారు. అయోధ్యలో రామాలయం నిర్మాణం ద్వారా కొన్నివేల సంవత్సరాల చరిత్రకు ప్రాణం పోసినట్టుయిందన్నారు. ఆనాడు శ్రీలంకకు రాముడు వేసిన సేతువు పదిహేడున్నర లక్షల సంవత్సరాలుగా నాసా ప్రకటించిందన్నారు. ఇది సహజంగా ఏర్పడింది కాదని మానవ నిర్మితమని తేల్చిచెప్పారని చినజీయర్ స్వామి గుర్తుచేశారు. ప్రపంచలో ఏ మూల అప్పటికి ఏ నాగరికత కళ్లు తెరవలేదన్నారు. అందువల్లే కొత్త ఆలయాలు నిర్మించడం కన్నా పాత ఆలయాలకు పూర్వ వైభవం తీసుకురావడం ముఖ్యమన్నారు. కార్యక్రమంలో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, వైసీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, అన్నవరం దేవస్థానం జాయింట్ కమిషనర్ రామచంద్రమోహన్, అన్నవరం, కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాలు వేద పండితులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టి.. కాల్వలోకి దూసుకెళ్లిన కారు

- మోటార్ సైకిలిస్టుకు తీవ్ర గాయాలు, ఆసుపత్రికి తరలింపు
- కారులో ప్రయాణిస్తున్న ఏడుగురిలో ఒకరికి గాయాలు
- ఏడుగురు ప్రాణాలు కాపాడిన ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాస్

పి.గన్నవరం, ఫిబ్రవరి 18: అదుపుతప్పిన కారు బైక్‌ను ఢీకొట్టి ఆపై ప్రధాన పంటకాల్వలోకి దూసుకుపోయిన సంఘటన పి.గన్నవరం మండలం బెల్లంపూడిలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.... రాజమహేంద్రవరంలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఓ కుటుంబం తిరిగి తమ స్వగ్రామం శివకోడు కారులో వస్తూ.....మార్గంమధ్యలో బెల్లంపూడి గ్రామం వచ్చే సరికి కారు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి ప్రధాన పంటకాల్వలోకి దూసుకుపోయింది. దీంతో మోటార్‌సైకిలిస్ట్ తాడాలవారిపాలెంనకు చెందిన యర్రంశెట్టి స్వామినాయుడు కాలుకు తీవ్రగాయం కాగా అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. కారులో ప్రయాణిస్తున్న కసుకుర్తి భాస్కరసుధీర్‌కుమార్‌కు స్వల్పగాయాలయ్యాయి. అలాగే ఆయన భార్య కె.సింధూ, పిల్లలు భాను, జయన్సు, తల్లి కె.పార్వతి, అత్తమామలు బిక్కిన సూర్యకాంతం, సుబ్బారాయుడులు సురక్షితంగా బయటపడ్డారు. కాగా అటుగా వెళుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు సంఘటనాస్థలిని పరిశీలించి స్వామినాయుడును హుటాహుటిన ఆసుపత్రికి తరలించే ఏర్పాటుచేశారు. అయితే స్వామినాయుడు గతంలో టైలరింగ్ పనిచేసుకుని జీవనం సాగించేవాడు ఆరోగ్యం సహకరించకపోవడంతో గత కొన్నాళ్లుగా బెల్లంపూడి సెంటర్‌లో చిరువ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈప్రమాదంతో ఆకుటుంబం రోడ్డున పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బెల్లంపూడి పంట కాల్వలోకి దూసుకుపోయిన కారు నుంచి ప్రయాణికులను బయటకు తీస్తున్న ఏఆర్ కానిస్టేబుల్



ప్రమాదం నుంచి బయటపడ్డ శివకోడు గ్రామానికి చెందిన ప్రయాణికులు

ఏడుగురు ప్రాణాలు కాపాడిన ఏఆర్ కానిస్టేబుల్..

తూర్పుగోదావరిజిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నెల్లి శ్రీనివాస్ ఉడిమూడి శివారు చింతావారిపేటలో ఒక వివాహవేడుకలో పాల్గొని తన కారులో మండల కేంద్రం పి.గన్నవరం వెళ్లారు. తిరిగి రాజమహేంద్రవరం బయలుదేరగా మార్గంమధ్యలో బెల్లంపూడిలో వచ్చే సరికి కళ్లెదుటే జరిగిన సంఘటనను చూశారు. వెంటనే స్పందించిన శ్రీనివాస్ చాకచక్యంగా వ్యవహరించి పంటకాల్వలోకి దూకి స్థానికుల సాయంతో ఏడుగురినీ ఒడ్డుకు చేర్చారు. శ్రీనివాస్‌ను స్థానిక ఎమ్మెల్యే చిట్టిబాబుతో పాటు ప్రయాణికులు బంధువులు, స్థానికులు అభినందనలు తెలిపారు. ఆ కుటుంబం ప్రాణాలు కాపాడి నిజమైన పోలీస్‌గా నిలిచారని ప్రసంశలు కురిపించారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ శ్రీనివాస్ మాట్లాడుతూ పంటకాల్వలోకి దూసుకుపోయిన కారుకు కాల్వలో పేరుకుపోయిన తూడు అడ్డేసింది. దీంతో కాల్వలోని కూతవేటు దూరంలో నీటిలో తేలియాడుతున్న కారు వద్దకు వెళ్లే సరికి నీరు వేగంగా ప్రవహిస్తోంది. వెంటనే దోరులు లాగి వలంటీర్ లక్ష్మణ్, స్థానికులు సాయంతో ఏడుగురును ఒడ్డుకు చేర్చాగలిగాను. తూడు లేకపోతే కారు కాల్వమధ్యలోకి వెళ్లి పెనుప్రమాదం సంభవించేది.

కాల్వ చెంతనే రక్షణగా రైలింగ్‌లు ఏర్పాటు చేయాలి

రాజవరం-పొదలాడ రహదారిలో గంటి నుంచి పి.గన్నవరం వరకు ప్రధాన పంట కాల్వ వైపు రక్షణగా ఇనుప రైలింగ్‌లను ఏర్పాటు చేయాలి. అప్పుడే ఇటువంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదని స్థానికులు కోరుతున్నారు.



అట్లపాడు వద్ద స్కూటీ పై నుంచి పడి మృతి చెందిన లెక్చరర్

స్కూటీ నుంచి జారిపడి లెక్చరర్ మృతి

నిడదవోలు, ఫిబ్రవరి 18: స్కూటీ నుంచి జారిపడి ఓ లెక్చరర్ మృతిచెందారు. నిడదవోలులోని ప్రభుత్వ బాలుర కళాశాలలో ఇంగ్లీష్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న మెరకనల్లి ప్రసన్నకుమార్ (55) ఆదివారం నిడదవోలు నుంచి వేలివెన్ను వెళుతూ అట్లపాడువద్ద స్కూటీ అదుపుతప్పి జారిపడి రోడ్డుపై పడ్డంతో ముఖానికి తీవ్రగాయా లై సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. ప్రసన్న కుమార్ కొద్దిరో జులుగా వేలివెన్ను శశి కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నా రు. ఆయనకు భార్య, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సమిశ్రగూడెం ఎస్ఐ రమేష్ తెలిపారు.

రేపు ద్రాక్షారామ భీమేశ్వరుడి కల్యాణం



భీమేశ్వరస్వామివారు, మాణిక్యాంబ అమ్మవారు

ఘనంగా ఏర్పాట్లు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 18: ప్రసిద్ధిగాంచిన శైవక్షేత్రం, పంచారామం ద్రాక్షారామలో ఉన్న మాణిక్యాంబసమేత భీమేశ్వరస్వామివారి దివ్యకల్యాణం 20న మంగళవారం నిర్వహించనున్నారు. స్వయంభువుడు శ్రీభీమేశ్వరస్వామి వారు, ద్వాదశశక్తిపీఠం మాణిక్యాంబ అమ్మవారికి, క్షేత్రపాలకులు శ్రీలక్ష్మీసమేత నారాయణస్వామివారు, శ్రీచండిక సమేత సూరేశ్వరస్వామివార్లకు ఒకే వేదికపై మంగళవారంరాత్రి ఆరుద్ర నక్షత్ర తులాలగ్నమందు రాత్రి 10.25నిమిషాలకు ఏకకాలమందు కల్యాణ మహోత్సవం జరుగుతుంది.

స్వామివారికి రుద్రాభిషేకం, లక్ష రుద్రాక్షలతో పూజ

మంగళవారం ఉదయం 5.45కు కల్యాణమూర్తులను ఆహ్వానిస్తారు. స్వామి కల్యాణ మహోత్సవం పురస్కరించుకుని ఉదయం 8.00 గంటలకు భీమేశ్వరునికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరుగుతుంది. అనంతరం లక్ష రుద్రాక్షలతో పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 3.05 గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణం, 5 గంటలకు నందివాహనంపై స్వామివారి నగరోత్సవం జరుగుతుంది. అనంతరం రాత్రి 10.25 నిమిషాలకు స్వామివార్ల కల్యాణం దేవస్థానం బ్రహ్మదేవులపల్లి పణిరామకృష్ణచే జరుగుతుంది. తిరుమల తిరుపతి దేవస్థానం వారు స్వామి,అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

కల్యాణ కార్యక్రమాలు

21న గరుడవాహనంపైస్వామివారి నగరోత్సవం జరుగుతుంది. 22న ఉదయం 9గంటలకు నగరోత్సవం, సాయంత్రం 4.45 గంటలకు స్వామి వార్ల సదస్యం, పండిత సత్కారం రాత్రి 8.45కు సర్వవాహనములపై స్వామివారి నగరోత్సవం నిర్వహిస్తారు. 23న మధ్యాహ్నం 2.35 గంటలకు భీమేశ్వరుని రథోత్సవం, సాయంత్రం 6.00 గంటలకు వేగాయమ్మపేట ఆస్థాన మండపంలో స్వామివార్ల ఆస్థాన పూజ జరుగుతుంది. 24న ఉదయం 8.10గంటలకు స్వామి వసంతోత్సవం, నాకబలి, తదుపరి త్రిశూ ల, శ్రీ చక్ర స్నానం జరుపుతారు. 25 రాత్రి 7.05 గంటలకు సప్తగోదావరి నదిలో స్వామివారి తెప్పోత్సవం నిర్వహిస్తారు. 26న రాత్రి 7.05లకు స్వామివారి శ్రీపుష్పోత్సవం జరుగుతుంది.

శోభాయమానంగా కల్యాణవేదిక

భీమేశ్వరస్వామి కల్యాణమహోత్సవాలు పురస్కరించుకుని ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ అంతర ప్రాంగణంలో శోభాయమానంగా కల్యాణ వేదికను భారీగా తీర్చిదిద్దారు. స్వామి కల్యాణం వేలాదిమంది తిలకించేందుకు ప్రత్యేకంగా పందిర్లు ఏర్పాటు చేశారు. ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ చేశారు. కల్యాణ మహోత్సవం తిలకించేందుకు వచ్చిన భక్తులకుస్వామి తీర్థప్రసాదాలతోపాటు, స్వామివారి కల్యాణ ముత్యాల తలంబ్రాలు అందజేస్తామని ఆలయ ఈవో పి.టి.వి. సత్యనారాయణ తెలిపారు.


దేవస్థానం అన్నదాన మండపం ప్రారంభం

ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి దేవస్థానం అన్నదాన మండపం ఆదివారం ఉదయం 10.42 గంటలకు ప్రారంభించారు. రూ.1.5కోట్లతో నిర్మించిన అన్నదాన మండపాన్ని వ్యాపారవేత్త సత్తిసుబ్బారెడ్డి, సీతారత్నం దంపతులు, కుటుంబీకులు పూజాధికాలు నిర్వహించి భవనం ప్రారంభించారు. అన్నదాన మండపం సత్తిసుబ్బారెడ్డి దంపతులు నిర్మించారు. తొలిరోజు 5 వేలమందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఏపీఐడీసీ డైరెక్టరు వాసంశెట్టి శ్యామ్, వైస్ ఎంపీపీలు శాకా బాబీ, నరాల రాజ్యలక్ష్మీ, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఈవో పి.టి.వి. సత్యనారాయణ, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



భీమేశ్వరస్వామి అన్నదాన మండపం ప్రారంభిస్తున్న సత్తిసుబ్బారెడ్డి, సీతారత్నం దంపతులు

దగా పడ్డ దళితులు : మహాసేన రాజేష్




నిడదవోలులో దళితుడా రా కదలిరా సభలో ప్రసంగిస్తున్న మహాసేన రాజేష్

నిడదవోలు, ఫిబ్రవరి 18: ఎంతో పౌరుషం ఉన్న దళితులు వైసీపీ ప్రభుత్వంలో దగా పడ్డారని, జగన్‌రెడ్డి దళితులను నమ్మించి మోసం చేశాడని, మోసపోయిన దళితులు 2024 ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని మహాసేన రాజేష్ అన్నారు. నిడదవోలు లోని బీఆర్ అంబేడ్కర్ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాలులో ఆదివారం దగాపడిన దళితుడా రా.. కదలి రా.. కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మనవాళ్లెవరో పగవాళ్లెవరో తెలుసుకుందామని దళితులకు గౌరవం ఇస్తున్న చంద్రబాబు, లోకేశ్‌లకు అండగా ఉండి 2024 ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. వైసీపీ పాలనలో దళితులు హత్యకు గురవుతున్నారని, టీడీపీ పాలనలో దళితులు రాజకీయంగా ఎదిగేందుకు ఎంతో భవిష్యత్తు ఇచ్చారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలకు దళితులు ఆరాటపడక్కరలేదని, అందరికీ ఇస్తున్న పథకాలే ఇస్తున్నారని, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేకంగా ఇచ్చేవి ఏమీ లేవన్నారు. అన్ని రంగాల్లో ఉన్న దళితులు అభివృద్ధి చెందాలని, అది టీడీపీ ప్రభుత్వం హయాంలోనే సాధ్యమవుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవడమే మనందరి బాధ్యత అని రాజేష్ అన్నారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుతో కలసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

- మరొకరి పరిస్థితి విషమం



రోడ్డు ప్రమాదానికి గురైన యువకులు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 18: అయినవిల్లి మండలం మాగం నుంచి అమలాపురం పల్సర్ మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులు అదుపుతప్పి రోడ్డు ప్రక్కన ఉన్న కొబ్బరి చెట్టును ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందగా ఒక యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. సిరిపల్లి-మునిపల్లిరోడ్డులో ముమ్మిడివరం మండలం అనాతవరం పంచాయతీ పరిధిలో గుబ్బలవారిపాలెం వద్ద ఆదివారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో అమలాపురంనకు చెందిన అడబాల సాయి హర్ష(23) అక్కడిక్కడే మృతి చెందాడు. పెదపట్నంలంకకు చెందిన కొమ్ముల అనిల్(21) అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అమలాపురానికి చెందిన యండమూరి లోకేష్(23) అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. హర్ష మృతదేహన్ని ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం ఎస్ఐ డి.సురేష్ బాబు కేసు నమోదు చేసి దరాప్తు చేపట్టారు. ఈముగ్గురు మిత్రుల్లో అడబాల హర్ష ఇటీవల మోటార్‌సైకిల్ కొనుగోలు చేశాడు. వీరిలో బీటెక్ వరకు చదువుకున్న హర్ష అయినవిల్లి మండలం మాగంలో అమ్మమ్మ ఇంటివద్ద ఉంటున్నాడు. వారి తల్లిదండ్రులకు ఇద్దరు మగసంతానం. లోకేష్ డిగ్రీ వరకు చదువుకుని ప్రస్తుతం ఉద్యోగం చేసుకుంటున్నాడు. కొమ్ముల అనిల్ ఇటీవలే గల్ఫ్ నుంచి తిరిగివచ్చాడు.



తాళ్ళపోడులో కాలిపోతున్న బస్సు

పార్కింగ్ చేసిన చోటే.. కాలేజీ బస్సు దగ్ధం

కె.గంగవరం, ఫిబ్రవరి 18: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం తాళ్ళపోడులో ఆదివారం ఉదయం పార్కింగ్ చేసిన బస్సులో మంటలు వ్యాపించి దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నా యి. తాళ్ళరేవు మండలం సుంకరపాలెం పరిధిలోని రవి జూనియర్ కాలేజీ బస్సు తాళ్ళపోడు పరిసర ప్రాంతాల నుంచి విద్యార్థులను కళాశాలకు తరలిస్తుంది. ఆదివారం కావడంతో తాళ్ళపోడులోనే పార్కింగ్ చేశారు. ఆదివారం ఉదయం ఉన్నట్టుండి బస్సు నుంచి మంటలు వ్యాపించాయి. స్థానికులు మంటలు అదుపు చేశారు. అప్పటికే బస్సు చాలావరకూ కాలిపోయింది. దీనిపై కళాశాల ప్రిన్సిపాల్ పి.ఉమామహేశ్వరరావు ఫిర్యాదు చేశారు. పామర్రు ఎస్.ఐ. జానీబాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.


సందేశాత్మకంగా సాగిన నాటికలు

తాటిపర్తిలో ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీలు

గొల్లప్రోలురూరల్, ఫిబ్రవరి 18: మన సంస్కృతి, సంప్రదాయాల విశిష్టత, కుటుంబ విలువలు ప్రాధాన్యతను చాటిచెబుతూ నాటికల ప్రదర్శనలు కొనసాగాయి. గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలోని అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణా కళావేదికపై మార్కండేయ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీలు రెండో రోజు ప్రదర్శించిన నాటికలు సందేశాత్మకంగా సాగాయి.ప్రేమ విలువను తెలియచెబుతూ ప్రదర్శించిన ఇంద్రప్రస్థం నాటిక అందరినీ ఆలోచింప చేసింది. ప్రేమ అనేది సృష్టిలో ఎంతో గొప్పదని, అది సమాజంలో అందరూ హర్షించేలా ఉండాలే తప్ప, అనాలోచిత నిర్ణయాలతో తప్పటడుగులు వేయకూడదని ఈ నాటిక ద్వారా చాటిచెప్పారు. గుంటూరు అభినయ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన ఈ నాటికను గోపి సత్యప్రకాష్(స్నిగ్ధ) రచించగా, ఎస్.రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించారు.

బిడ్డలపై అమ్మకు ఉండే అనురాగం, ప్రేమ చాటిచెప్పిన..

అమ్మ మనస్సు, బిడ్డలపై ఆమెకు ఉండే ప్రేమ, అనురాగం చాటిచెబుతూ కౌసల్య సుప్రజ రామా నాటికను ప్రదర్శించారు. పురాణాలు, వేదాలు, సమాజాలు, ఓంకార నాదాలకు ఒక ధర్మం ఉన్నట్టే అమ్మ మనస్సుకు ఒక ధర్మం ఉంటుంది. అదే కనిపెంచిన ధర్మం, మనకు కనిపించని ధర్మం అంటూ అమ్మ విశిష్టతను చాటిచెప్పింది. రామాయణంలో రాముడు అడవులకు వెళ్లినప్పుడు తల్లి కౌసల్య ఎంత బాధపడుతుంది, అతని కూడా వెళ్లకపోయినా మనస్సు మాత్రం అతని ఉన్న విధంగానే నేడు బిడ్డలు వద్దని వదిలించుకుంటున్నా, సముద్రాలు దాటి విదేశాలకు వెళ్లిపోతున్నా అమ్మ మనస్సు మాత్రం వారిని అంటి పెట్టుకునే ఉంటుందని, ఇది అందరూ గమనించాలని సందేశాన్నిచ్చారు. కొలకలూరు సాయి ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన ఈ నాటికను గోపి సత్యప్రకాష్ రచించగా, గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు.



స్వీకారం నాటికలోని దృశ్యం

భార్యను వదిలివేస్తే కుటుంబమే వెలివేసింది

- కుటుంబ విలువల విశిష్టతను చాటిచెబుతూ స్వీకారం నాటిక

కుటుంబ విలువలను చాటిచెబుతూ అది మీరితే అందరికీ దూరమవ్వాల్సి ఉంటుందనే సందేశాన్నిఇస్తూ స్వీకారం నాటికను ప్రదర్శించారు. సంప్రదాయబద్ధంగా ఉన్న కుటుంబం నుంచి వచ్చిన మహిళను విదేశాల్లో ఉన్న కొడుకుకు ఇచ్చి వివాహం చేస్తాడు ఒక తండ్రి. అయితే అక్కడే ఉన్న వేరే మహిళతో డేటింగ్‌లో ఉండి తన భార్యకు విడాకులు ఇస్తాడు. దీంతో అతని తండ్రి కోడలును దత్తత తీసుకుంటారు. ఇది తెలిసి స్వదేశానికి వచ్చిన కొడుకు ప్రశ్నిస్తూ నీవు నీ భార్యకు విడాకులు ఇవ్వడం కాదు. నేనే మీకు విడాకులు ఇస్తున్నామని తల్లిదండ్రులు చెబుతారు. మా ఆస్తికి ఆమే వారసురాలని ప్రకటిస్తారు. అగ్నిసాక్షిగా పెళ్లాడిన భార్యను లేదా భర్తను వదిలివేసే వారికి తండ్రులు ఇచ్చే తీర్పు ఇదేనని నాటిక ద్వారా తెలియజెప్పారు. అమలాపురం రసవాహిని కళాకారులు ప్రదర్శించిన స్వీకారం నాటికను రావి నాగేశ్వరరావు రచించగా, మహ్మద్ షహెన్నా దర్శకత్వం వహించారు.



తాటిపర్తిలో జరుగుతున్న ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీల్లో ప్రదర్శించిన ఇంద్రప్రస్థం నాటిక

తైక్వాండోతో బాలికలకు ఆత్మరక్షణ

అంబాజీపేట, ఫిబ్రవరి 18: తైక్వాండో క్రీడతో బాలికలకు ఆత్మరక్షణ కలుగుతుందని జిల్లా తైక్వాండో ప్రధానకార్యదర్శి, బ్లాక్ బెల్ట్ ఎగ్జామినర్ బి.అర్జునరావు అన్నారు. అంబాజీపేట హైస్కూల్ క్రీడాప్రాంగణంలో తైక్వాండ క్రీడాకారులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. జిల్లాలో నుంచి 88మంది క్రీడాకారులు టెస్టులో పాల్గొన్నట్లు సీనియర్‌కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. హెచ్ఎం కడలి సాయిరామ్, సీనియర్ కోచ్ కె.సత్యనారాయణ, బి.కుష్వేర్, మణికంఠ, పితాని భార్గవిశ్రీకళ, రమేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన కూటమి గెలుపు ఖాయం: వేగుళ్ల




రాయవరం: చెల్లూరులో భవిష్యత్తు గ్యారంటీలో ఎమ్మెల్యే వేగుళ్ల. ఆలమూరు: గాంధీనగరంలో బాబు ష్యూరిటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బండారు

రాయవరం, ఫిబ్రవరి 18: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన కూటమి గెలుపు ఖాయమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. చెల్లూరులో చేపట్టిన భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని, రాష్ట్రం అన్నిరంగాల్లో ముందుకు సాగాలంటే చంద్రబాబును వచ్చే ఎన్నికల్లో ప్రజలు అధికారంలోకి తీసుకురావాలన్నారు. గ్రామంలో ఇంటింటికీ పర్యటించిన ఎమ్మెల్యేకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. సూపర్‌సిక్స్ పథకాలను ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చుండ్రు వీర్రాజు, మాజీ వైఎస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు, మాజీ సర్పంచ్‌లు నూనె ఏసుబాబు, మోరంపూడి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి సర్పంచ్ భర్తకు లేదు:

ఎమ్మెల్యే వేగుళ్లను విమర్శించే స్థాయి చెల్లూరు సర్పంచ్ భర్త, వైసీపీ నేత పాలికి గోవిందుకు లేదని టీడీపీ నేతలు అన్నారు. ఆదివారం చెల్లూరులో వారు విలేకరులతో మాట్లాడారు. ఇటీవల గ్రామ సచివాలయం-2 ప్రారంభోత్సవం సందర్భంగా సర్పంచ్ భర్త ఎమ్మెల్యేపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు మోరంపూడి రాజ్‌కుమార్, చుండ్రు వీర్రాజు, కురుపూడి రాజు, దార్ల సుధీర్, మార్ని రాంబాబు, దేవు వెంకట్రాజు, పంపన సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 18: అప్పుల పాలైన రాష్ట్రాన్ని గాడిన పెట్టి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ ఎన్నికల శంఖారావ యాత్ర ఆనందరావు ఆధ్వర్యంలో తాండవపల్లిలో ఆదివారం నిర్వహించారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్-6 పథకాలను వివరిస్తూ ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, మండలశాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, కైరం రాము, పరమట శరత్‌బాబు, కైరం సత్తిబాబు, నంద్యాల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన పార్టీలతోనే అభివృద్ధి సాధ్యం

ఆలమూరు, ఫిబ్రవరి 18: నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధికి దూరమయ్యాయని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన సంయుక్తంగా రాష్ట్రంలో అధికారంలోనికి రావడం ఖాయమని, ఈపార్టీల ద్వారానే అభివృద్ధి జరుగుతుందన్నారు. గాంధీనగరం, చొప్పెల్ల శివారు శ్రీరామ్‌నగర్‌లలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ, జనసేన పార్టీలు చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను కరపత్రాల రూపంలో ప్రజలకు అందించారు. రాష్ట్రం అంధకారమయంగా మారిందని దీని నుంచి ప్రజలు బయటకు రావడానికి సిద్ధంగా ఉన్నారని బండారు అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి, నాగిరెడ్డి వెంకటరత్నం, పలువురు టీడీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ వీర్రాజు మృతి



కాట్రేనికోన, ఫిబ్రవరి 18: కాట్రేనికోన మాజీ ఎంపీపీ సంగాని వీర్రాజు(78) అనారోగ్యంతో మృతిచెందారు. ఈయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వీర్రాజుకు భార్య, నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీర్రాజు సుదీర్ఘ కాలం పాటు బలుసుతిప్ప సర్పంచ్‌గా పనిచేశారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎంపీపీ పాలెపు లక్ష్మీధర్మారావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, జడ్పీటీసీ నేల కిశోర్, సర్పంచ్ మల్లాడి ఏడుకొండలు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు గంటి సుధాకర్ సంతాపం వ్యక్తం చేశారు.

బీజేపీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా పెసల

యానాం, ఫిబ్రవరి 18: బీజేపీ పుదుచ్చేరి శాఖ సోషల్ మీడియా స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా యానానికి చెందిన పెసల వెంకటేష్‌ను నియమిస్తూ బీజేపీ శాఖ సోషల్ మీడియా అధ్యక్షుడు ఎం.మహేష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేష్‌కు యానాంకు చెందిన నాయకులు కాదా పవన్ ప్రసాద్, హరిప్రసాద్ తదితరులు అభినందనలు తెలిపారు.

నేడు వెంకన్న కల్యాణం

అంబాజీపేట, ఫిబ్రవరి 18: పుల్లేటికుర్రులో ఉన్న భూసమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి కళ్యాణం సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారపర్య ధర్మకర్త బచ్చు సుబ్రహ్మణ్యగుప్త తెలిపారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

యానాం స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా మురుగునాథం

యానాం, ఫిబ్రవరి 18: యానాం పోలీస్‌స్టేషన్ (స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా (ఎస్‌హెచ్‌వో) పుదుచ్చేరికి చెందిన మురుగునాథం బాధ్యతలు స్వీకరించారు. ఎస్ఐ, ఏఎస్ఐ, సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజవర్గ పరిధిలో శాంతిభద్రత పరిరక్షణకు ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ పూవ్వల వీరభద్రస్వామి పాల్గొన్నారు.

25న జిప్‌మెర్ ఆసుపత్రి ప్రారంభానికి ఏర్పాట్లు

- వర్చువల్‌లో ప్రారంభించనున్న ప్రధాని మోదీ

యానాం, ఫిబ్రవరి 18: యానాం ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు కేంద్రప్రభుత్వం యానాంలో నిర్మించిన జిప్‌మెర్ కన్సల్టింగ్ యూనిట్‌ను ఈనెల25న వర్చువల్ విధానంలో ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభించనున్నారు. జిప్‌మెర్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్, జిప్‌మెర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ అనందరాజ్, సూపరింటెండెంట్ పార్వతీలు ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

ఆత్రేయపురం, ఫిబ్రవరి 18: ఆత్రేయపురంలో 344మందికి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆదివారం ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఆత్రేయపురం, ఉచ్చిలి, వసంతవాడ, వెలిచేరు,తాడిపూడి గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు జగనన్న ఇళ్ల స్థలాల పట్టాలను అందించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డిసాయి ఆలయ వార్షికోత్సవం

రావులపాలెం, ఫిబ్రవరి 18: రావులపాలెంలోని ముసలి రామాలయం ప్రాంగణ సమీపంలో ఉన్న షిర్డి సాయిబాబా ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో బాబా వారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నీరాజన మంత్ర పుష్పం వైభవోపేతంగా జరిగాయి. భక్తులు బాబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా సత్తెమ్మతల్లి తీర్థం

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 18: గొల్లవిల్లి- సన్నవిల్లి గ్రామాల ఇలవేల్పు సత్తెమ్మతల్లి తీర్థం ఆదివారం వైభవంగాజరిగింది. ఓఎన్జీసీ సెంటర్ సమీపంలోని ఈఆలయం వద్ద ఉదయం నుంచి భక్తులు ముడుపులు చెల్లించుకునేందుకు బారులు తీరారు. అమ్మవారికి కుంకుమ పూజలు జరిగాయి. గరగ నృత్యాలు, బ్యాండు మేళాలతో అమ్మవారి సంబరం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 18: కామన్ సర్వీసు సెంటర్ ఆధ్వర్యంలో బండారులంక బాపూజీ-కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సీఎస్సీ బాల స్వస్థీయ క్యాంపులో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. పదేళ్లలోపు విద్యార్థులకు చెవి, ముక్కు, గొంతు వైద్యురాలు డాక్టర్ సత్యప్రియాంక, కంటి వైద్య నిపుణుడు బి.ప్రకాష్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. పాఠశాల డైరెక్టర్ మోర్త శ్యామ్, ప్రిన్సిపాల్ సోమయాజులు, సీఎస్సీ జిల్లా మేనేజర్ తమ్మన రాజేష్, కుడుపూడి రమణ, దడాల వంశీ, గుత్తుల సాయితేజ పాల్గొన్నారు.

వంట సామగ్రి అందజేత

మలికిపురం, ఫిబ్రవరి 18: మానవతామూర్తుల సేవాసంస్థ సమాజంలో హిందూ ధార్మిక కార్యక్రమాలు చేసుకునేవారికి శాకాహార వంట పాత్రలను అందుబాటులోకి తెచ్చారు. ఆదివారం బట్టేలంక కేంద్రంగా నిడదవోలుకు చెందిన పెనుగొండ రాంబాబు రూ.లక్ష విరాళం అందించడంతో ఆ నిధులతో శాకాహార వంట సామాగ్రిని సమకూర్చారు. శ్రీసీతారామ తెలగ యువజన సంఘం ద్వారా హిందూ ఆధ్యాత్మిక కార్యక్రమాలను అందుబాటులోకి తెస్తున్నట్టు మానవతామూర్తుల సేవాసంస్థకు చెందిన బోనం రాజు తెలిపారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.1.12లక్షల విరాళం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 18: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి విజయవాడకు చెందిన పంచలవరపు కామేశ్వరశర్మ-నాగలక్ష్మి దంపతులు రూ.1,12,000 విరాళం సమర్పించారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ. 2,73,364 లభించినట్లు ఆలయ ఈవో బీహెచ్‌వీఎస్ఎన్ కిశోర్‌కుమార్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడి అమానుషం

బాధ్యులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

అమలాపురం(ఆంధ్రజ్యోతి), ఫిబ్రవరి 18: అనంతపురం జిల్లా రాప్తాడు వద్ద శనివారం వైసీపీ నిర్వహించిన సిద్ధం బహిరంగ సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడం దుర్మార్గపు చర్యని తెలుగుదేశం పార్టీ మీడియా కోఆర్డినేటర్ బోళ్ల సతీష్‌బాబు అన్నారు. ఫొటోగ్రాఫర్ దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈసందర్భంగా సతీష్‌బాబు మాట్లాడుతూ ప్రజాస్వామ్యవాదులు వాటిని తీవ్రంగా ఖండించాలన్నారు. కృష్ణపై దాడికి పాల్పడిన వ్యక్తులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జర్నలిస్టుగా తమ వృత్తి ధర్మంలో భాగంగా రాజకీయ బహిరంగ సభలో పాల్గొంటారని అన్నారు. జర్నలిజం వారి వృత్తని, దానిని రాజకీయ కోణంలో చూడడం సరికాదన్నారు. ఈదాడి సంఘటన తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

తిరుమల తరహాలో విమాన వేంకటేశ్వరుడు ప్రతిష్ఠాపన



విమాన వేంకటేశ్వరుడు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 18: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుమల తరహాలో విమాన వేంకటేశ్వరస్వామి ప్రతిష్ఠాపనకు ముహూర్తం ఖరారు చేశారు. రూ.15లక్షల వ్యయంతో విమాన వేంకటేశ్వరుడిని ఓ దాత సాయంతో తయారు చేయించారు. స్వర్ణశోభితుడైన శ్రీవారి చుట్టూ వెండి మకరతోరణంతో తిరుమలలో మాదిరిగానే విమాన వేంకటేశ్వరుడిని దాత చేయించారు. ఆలయ ఉత్తర భాగంలో స్వామివారి ఆలయ గోపురంపై విమాన వేంకటేశ్వరుడిని ప్రతిష్ఠించనున్నారు. వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం బ్రహ్మ ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యుల బ్రహ్మత్వంలో వేద పండితులు 21వ తేదీ బుధవారం ఉదయం 10.30లకు ప్రతిష్ఠాపన నిర్వహించనున్నారు. 20, 22వ తేదీల్లో ప్రత్యేక పూజలు హోమాలు, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు ఘనంగానిర్వహించనున్నారు. ప్రతిష్ఠాపనకు సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో బీహెచ్‌వీఎస్ఎస్ కిశోర్‌కుమార్ తెలిపారు.

ఎమ్మెల్యే వేగుళ్ల పరామర్శ

మండపేట, ఫిబ్రవరి 17: మండపేటలో పలు కుటుంబాలను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆదివారం పరామర్శించారు. ముత్తారెడ్డి శ్రీనివాస్, ఏడిదకు చెందిన సిద్ధాంత పురవి, పైడిమళ్ల సుబ్బా యమ్మ కుటుంబ సభ్యులను వేగుళ్ల పరామ ర్శించారు. ఆయన వెంట టీడీపీ నేతలు పాలచర్ల శిరీషా, చుండ్రు రాంబాబు, మేడింటి సూర్యప్రకాష్ ఉన్నారు.

22న అసెంబ్లీ సమావేశం

యానాం, ఫిబ్రవరి 18: మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు ఈనెల22 పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశం జరుగుతుంది. సీఎం రంగసామి ఆర్థికమంత్రి హోదాలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల అనంతరం పూర్తిస్థాయిలో బడ్జెట్ ప్రవేశపెడతారు.

ఘనంగా సత్తెమ్మ జాతర

రాయవరం, ఫిబ్రవరి 18: సోమేశ్వరంలో సత్తివారి సత్తెమ్మ జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. గరగనృత్యాలు, కాంతార వేషాలు, శక్తివేషాలు ఆకర్షణగా నిలిచాయి. అమ్మవారికి భక్తులు, పసుపు, కుంకుమ, చీరలు,గాజులు, నైవేద్యంసమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవార్నిపసలపూడికి చెందిన సినీ దర్శకుడు కర్రి రామారెడ్డి దర్శించుకున్నారు. సత్తి అబ్బాయిరెడ్డి, సూరయ్యమ్మ, సత్తి ధనరెడ్డి, వెంకటలక్ష్మి, సాయికృష్ణారెడ్డి, పద్మ, చిన్నారెడ్డి, సత్యనారాయణరెడ్డి, వీర్రెడ్డి, అరుణ పాల్గొన్నారు.



నేటి నుంచి నవజనార్ధనస్వామి కల్యాణోత్సవాలు



ఆలమూరు, ఫిబ్రవరి 18: నవజనార్ధనస్వామి ఆలయాలలో ఒకటైన ఆలమూరులో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత జనార్ధనస్వామి కల్యాణోత్సవాలు సోమవారం నుంచి 25వరకు జరగనున్నాయి. ఈనెల19 రాత్రి 8.15గంటలకు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ చైర్మన్ వనుం సూరిబాబు, ఆలయ కార్యానిర్వహణాధికారి సీహెచ్ సత్యనారాయణ సమక్షంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆ రోజు ముందుగా స్వామివారిని గరుడ వాహనంపై సన్నాయిమేళాలు, బాణసంచా కాల్పులతో భారీ ఊరేగింపు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 20న స్వామి రథోత్సవం 3 గంటలకు ప్రారంభమవుతుంది. అదే రోజు తీర్థ మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. 21న సదస్యం, 22న గజవాహనంపై స్వామి గ్రామోత్సవం, 23న హంస వాహనంపై ఊరేగింపులు జరుగుతాయని 24న స్వామివారికి చక్రస్నానం, 25న పుష్పోత్సవం జరుగుతాయని చైర్మన్ వనుం సూరిబాబు తెలిపారు.

నేడు జనార్ధనస్వామివారి కళ్యాణం

రేపు రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి



మండపేట, ఫిబ్రవరి 17: మండపేటలో ఉన్న శ్రీఅగ స్తేశ్వర జనార్ధనస్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. సోమవారం స్వామివారికి పంచామృతభిషేకం, ధ్వజారోహణం, 19న స్వామివారి కల్యాణం, 20న స్వామి వారి రథోత్సవం జరుగతాయని నిర్వాహకులు తెలి పారు. 21న గరుడువాహనంపై స్వామివారి ఊరేగింపు, 22న స్వామి వారు తిరిగి దేవాలయానికి తిరిగిచేరుట, 23న చతు రోత్సవం, 24న స్వామివారికి చక్రస్నానం, 25న స్వామి వారికి శ్రీపుష్పయాగం జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు తథ్యం



వైసీపీ నుంచి తెలుగుదేశంలో చేరిన కార్యకర్తలతో రెడ్డి సుబ్రహ్మణ్యం, రేవు శ్రీను

కె.గంగవరం, ఫిబ్రవరి 18: రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు కావడం తథ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రెడ్డి సుబ్రహ్మణ్యం, నియోజకవర్గ పరిశీలకులు కాకినాడ రామారావు అన్నారు. ఆదివారం కోటిపల్లిలో సీనియర్ నాయకుడు రేవు శ్రీను ఆధ్వర్యంలో నాయకులతో కలిసి వారు పర్యటించారు. ఈసందర్భంగా పలు కూడళ్లలో వారు మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎండగట్టారు. టీడీపీ ప్రభుత్వం చేపట్టబోయే పథకాలు వివరించారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సలాది రమేష్, మేడిశెట్టి సూర్యనారాయణ, వెలిచేటి శ్యామలరావు(పేకేరు బాబ్జి), సర్పంచ్ పెమ్మాడి బేబి సత్తిబాబు, తమ్మా చిన్న పాల్గొన్నారు.

నేడు ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 18: అయినాపురంలో శ్రీఉమాసోమేశ్వరస్వామి ఆలయంలో నూతన శివలింగ, ధ్వజస్తంభ పరివాహర దేవతా పునఃప్రతిష్ఠా మహోత్సవం సోమవారం జరగనుంది. సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించనున్నారు. సోమేశ్వరస్వామి శివలింగ, ధ్వజస్తంభ పరివార దేవతా పునఃప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా ఈనెల15నుంచి యాగశాల ప్రతిష్ఠ, విఘ్నేశ్వరపూజ, జలాదివాసం, క్షీరాభిషేకం, ధాన్యదివాసం, విగ్రహ గ్రామోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం ప్రాణప్రతిష్ఠ, గోదర్శనం, అన్నసమారాధన వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పుల్లేటికుర్తి సత్యనారాయణశాస్త్రి బ్రహ్మత్వంలో ప్రముఖ శైవాగ పండితులచే ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

'చంద్రబాబు ఆదేశిస్తే ఎమ్మెల్యేగా పోటీ చేస్తా'

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 18: మూడున్నర దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీలో ఎన్నో కీలక పదవులను నిర్వహించడంతో పాటు పార్టీ ఆదేశాలను శిరసా వహిస్తున్నానని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో శెట్టిబలిజలకు ప్రాధాన్యత కల్పించే చోట చంద్రబాబు ఆదేశిస్తే ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని ఆయన పేర్కొన్నారు. పేరూరులో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ ఇప్పటికే రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడుని కలుసుకుని దరఖాస్తు అందజేశానన్నారు. రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న చౌంద్రమౌళి పాలకొల్లు నియోజకవర్గ పరిశీలకునిగా పనిచేస్తున్నారు.

21 నుంచి బీజేపీ ప్రజాపోరు యాత్ర

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 18: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, అభివృద్ధి నిరోధక కార్యక్రమాలను నిలదీస్తూ ఈనెల21 నుంచి 29వరకు ప్రజాపోరు యాత్ర నిర్వహిస్తున్నట్టు జిల్లా కన్వీనర్ యిళ్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్రంలో అవినీతి విలయ తాండవం చేస్తోందని, జగన్ అసమర్థ పాలనను ప్రజలందరికీ వివరించడమే లక్ష్యంగా పోరుయాత్ర సాగిస్తామన్నారు. అమలాపురంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో అసెంబ్లీ కన్వీనర్ దూరి రాజేష్ అధ్యక్షతన ఆదివారం కార్యకర్తల కార్యశాల సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు, సహ కన్వీనర్లు బొంతు శివాజీ, చీకురుమెల్లి శ్రీనివాస్, నండూరి శ్రీరామ్, అరిగెల తేజవెంకటేష్, సుంకరసాయి, గుమ్మళ్ల రెడ్డినాయుడు, కాళ్లకూరి గోపి తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వం మూల్యం చెల్లించక తప్పదు'

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 18: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని పాదయాత్రలో సీఎం జగన్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీని అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ సీపీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన చలో విజయవాడను నిర్బంధాలతో అణచివేయడాన్ని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు ఖండించారు. ప్రభుత్వ నిరంకుశ వైఖరి మరోసారి బయట పడిందన్నారు. ఎక్కడికక్కడ ఉద్యోగ, ఉపాధ్యాయులను అప్రజాస్వామికంగా అరెస్టులుచేశారని మండిపడ్డారు. ప్రభుత్వఅప్రజాస్వామిక వైఖరిని ప్రజాస్వామ్యవాదులు, మేధావులు ఖండించాలని కోరారు. సీఎం జగన్ ఇదే పంథాను కొనసాగిస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: అంబాజీపేట మ్యారేజీ బ్యాండు
వెంకటరమణ	: ఈగల్
శ్రీలలిత	: రాజధాని ఫైల్స్
శేఖర్ స్క్రీన్-1	: హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	: ఐ హేట్ లవ్
రమా	: గుంటూరు కారం
గణపతి	: హాయ్ నాన్న
వెంకటపద్మావతిస్క్రీన్-1	:ఊరుపేరు భైరవకోన
వెంకటపద్మావతి స్క్రీన్-2	: యాత్ర-2

గ్రామీణ చికిత్స కేంద్రాలతో మెరుగైన వైద్యసేవలు

అంబాజీపేట, ఫిబ్రవరి 18: గ్రామీణ వైద్య కేంద్రాల్లో మెరుగైన వైద్య సేవలందిస్తామని జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ అన్నారు. చిరతపూడిలో లూటుకుర్తి వెంకటరత్నం, సత్యనారాయణమ్మ జ్ఞాపకార్థం వారి సోదరుడు విశ్రాంత అడిషన్ ఎస్పీ ఎల్ఆర్‌కే మూర్తి, వెంకటరత్నం కుమారులు వెంకట్రత్నాద్, నాగరాజులు రూ.3లక్షలతో నిర్మించిన భైరాజు ఫౌండేషన్ విలేజ్ క్లినిక్‌ను వారు ప్రారంభించారు. ఇంటిలిజెన్స్ ఏఎస్ఐ ఇళ్ల ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు మాట్లాడారు. వెంకటరత్నం మనువడు ఎన్ఆర్ఐ లూటుకుర్తి శ్రీధర్ సహాయం ట్రస్టుద్వారా 40మంది వితంతవులకు రూ.1500చొప్పున రూ.60వేలు, 20మంది దివ్యాంగులకు రూ.1500 చొప్పున రూ.37,500 అందజేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వీకే రావు, దృశ్యకళల రాష్ట్ర చైర్‌పర్సన్ కుడుపూడి సత్యశైలజ, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, ప్రముఖ శిల్పి డి.రాజకుమార్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ కోట బేబీరాణి, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, విత్తనాల శేఖర్, నేదునూరి వీర్రాజు, దొమ్మేటి సాయికృష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం

అల్లవరం, ఫిబ్రవరి 18: కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని, జగన్ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని పీసీసీ జనరల్ సెక్రటరీ అయితాబత్తుల సుభాషిణి అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి, గిడుగు రుద్రరాజు ఆదేశాలపై కాంగ్రెస్ బలోపేతానికి మొగళ్లమూరులో ప్రచారం చేశారు. ముషిణి రామకృష్ణారావు, సాధనాల చినసత్యనారాయణ, యార్లగడ్డ రవీంద్ర, వంటెద్దు బాబి, నిమ్మకాయల నాగేంద్రప్రసాద్, అయితాబత్తుల కుమార్‌సింగ్, మొల్లేటి వెంకటేశ్వరరావు, రొక్కాల సత్యనారాయణ పాల్గొన్నారు.

రాజకీయవేత్త రాముడు మృతి



అల్లవరం, ఫిబ్రవరి 18: దేవగుప్తం గ్రామానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు, పీఏసీఎస్ డైరెక్టర్ పచ్చిమాల రామారావు(రాముడు)(68) మృతిచెందారు. పోతుల సుభాష్‌చంద్రబోస్, గెద్దం సురేష్‌బాబు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకట్రావు, పోతుల నాగరాజు, చింతా రామకృష్ణ, బూల లోకేనాథ్, సాధనాల శ్రీనివాస్, ఎంపీటీసీ ఎం.రాంబాబు తదితరులు రాముడు మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 18: అమలాపురం ఆర్ట్ ఫ్యామిలీ, సంస్కార భారతి జిల్లాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక భూపయ్య అగ్రహారంలోని శ్రీసీతారామచంద్రమూర్తి దేవాలయ ప్రాంగణంలోని పునర్వసు మండపంలో ఆదివారం త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు, భరతముని జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పేరి వాణి, ఆంద్ర ఉషారాణి, కొత్తూరి బాల, గొలకోటి కమల, తాతపూడి సౌమ్యలక్ష్మి, నిత్యశ్రీ తదితరులు త్యాగరాజస్వామి విరచిత పంచరత్న కీర్తనలు ఆలపించారు. తొలుత సద్గురు త్యాగరాజస్వామికి పూజలు నిర్వహించారు. సంస్కారభారతి అధ్యక్షుడు ఆకొండి పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పుత్సా కృష్ణకామేశ్వర్ ఆధ్వర్యంలో సంగీత, నృత్య కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కూచిమంచి కృష్ణ, శ్రీగిరి పద్మావతి, కోశాధికారి శ్రీపాద పద్మావతి, శిష్టా శ్రీహరి, లక్ష్మి, గోపాలకృష్ణ, వేదనభట్ల సాయిలక్ష్మి పాల్గొన్నారు.

గ్రామదేవతల జాతర మహోత్సవాలు

ఆలమూరు, ఫిబ్రవరి 18: జొన్నాడ, పెనికేరు గ్రామాల్లో గ్రామదేవతల జాతర మహోత్సవాలు ఘనంగా జరిగాయి. జొన్నాడలో రజకుల దేవత సత్తెమ్మతల్లి జాతర మహోత్సవం, పెనికేరులో పుంతలో ముసలమ్మ జాతర ఉత్సవాలు నిర్వహించారు. జాతర ఉత్సవాల సందర్భంగా విద్యుత్ దీపాలంకరణలు, గరగ నృత్యాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జొన్నాడ గ్రామ దేవత సత్తెమ్మ తల్లి అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దర్శించుకున్నారు. పెనికేరులో అమ్మవారిని జనసేన పార్టీ కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ దర్శించుకున్నారు.

కాంగ్రెస్ పార్టీని గెలిపించండి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 18: ప్రజాస్వామ్య పరిరక్షణకు సుపరిపాలన కావాలంటే కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని పీసీసీ ఉపాధ్యక్షుడు ముషిణి రామకృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం ఇంటింటా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు పార్టీలో చేరగా రామకృష్ణారావు వారికి కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ముషిణి శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశంలో రామకృష్ణారావు మాట్లాడారు. పార్టీ ఆదేశిస్తే ముమ్మిడివరం నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానన్నారు. ఎస్సీ, ఎస్టీ విభాగ జిల్లా అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పి.ఉదయభాస్కరవర్మ, రెడ్డి బాబు, దేవరపల్లి రాజేంద్రబాబు, ఎస్.నాగేశ్వరరావు, ఎస్.రామకృష్ణ, యల్లమిల్లి వెంకటేశ్వరరావు, గుబ్బల రవి, ఎం.రమేష్, వై.ధనరాజు, ఎం.సురేష్‌బాబు, పి.లతీఫ్‌ఖాన్ పాల్గొన్నారు.


ఆసరా చెక్కుల పంపిణీ

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 18: వడ్లమూరులో ఆదివారం వైఎస్ఆర్ ఆసరా చెక్కులను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పంపిణీ చేసారు. గ్రామసర్పంచ్ చుండ్రు మంగాయమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 1514 డ్వాక్రా గ్రూపులకు రూ.12.30కోట్లు రుణమాఫీ జరిగినట్లు ఏపీఎం దుర్గాప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు, చుండ్రు చిట్టిబాబు, ఎంపీటీసీ పలివెల మధు, తదితరులు, ఎంపీడీవో రామకృష్ణారెడ్డి, సచివాలయ, డ్వాక్రా సిబ్బంది, ఏపీఎం ధనరాజు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మహిళా వాకర్స్ సేవ

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 18: అమలాపురం మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షురాలు శ్రీపాద ఎస్.పద్మావతి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక హరి మనో వికాస కేంద్రంలో విద్యార్థులకు అల్పాహారం, భోజనాలు అందించారు. సామాజిక వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్లబ్ సభ్యులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో గోటేటి గంగాధరరావు, గోటేటి లక్ష్మి, శ్రీగిరి పద్మావతి, వై.అనంతలక్ష్మి, కె.విజయలక్ష్మి, పుత్సా కృష్ణకామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన వేణుగానం



అమలాపురం రూరల్, ఫిబ్రవరి 18: ఇందుపల్లిలో జరుగుతున్న నవమ వార్షిక మాసదీక్షా సూర్యారాధన కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి. సౌరయాగంలో భాగంగా ప్రతీరోజు సాయంత్రం శ్రీ సవిత్ర కళా వేదికపై వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు పలు ప్రదర్శనలు ఇస్తున్నారు. దీనిలో భాగంగా ప్రముఖ వేణుగాన విద్వాంసుడు భైరవభట్ల సుబ్రహ్మణ్యశర్మ ఇచ్చిన వేణుగాన ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ప్రముఖ వయోలిన్ విద్వాంసుడు పాలపర్తి ఆంజనేయశాస్త్రికి కాపవరపు సుబ్బారావు మృదంగ సహకారం అందించారు. మార్చి 9వరకు ప్రతీరోజు సాయంత్రం సంగీత కచేరీ కార్యక్రమాలు నిర్వహిస్తామని యాగ నిర్వాహకులు గొర్తి గోపాలకృష్ణ తెలిపారు.

ప్రజాపోరు యాత్రను విజయవంతం చేయాలి

రామచంద్రపురం, ఫిబ్రవరి 18: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల21 నుంచి 29వరకు నిర్వహించే ప్రజాపోరుయాత్రను విజయవంతం చేయాలని రామచంద్రపురం అసెంబ్లీ కన్వీనర్ దూడల శంకరనారాయణ నాయకులను, కార్యకర్తలను కోరారు. పట్టణంలో హోటల్ రెటిన్యూలో జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ప్రజాపోరు యాత్ర-2 పార్లమెంటు కన్వీనర్ ఇళ్ల వెంకటేశ్వరరావు, కో-కన్వీనర్ బొంతు శివాజీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజాపోరు-2 కార్యక్రమం విజయవంతం చేయడం ప్రతిఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ప్రజాపోరు యాత్ర కో కన్వీనర్లు కేశవ రాఘవేంద్రరావు, సలాది సతీష్‌నాయుడు, టెలికం అడ్వైజరీ బోర్డు మెంబరు గుర్రాల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు శ్రీమతి కొప్పన లక్ష్మీ, జిల్లా కార్యదర్శి తలాటం అమ్మాజీ, కె.గంగవరం మండల అధ్యక్షుడు అవసరాల వెంకటరమణమూర్తి, రూరల్ అధ్యక్షుడు శ్రీకృష్ణ, ప్రధాన కార్యదర్శి కె.వెంకటరమణ, ట్రేడర్ సెల్ కన్వీనర్ కె.హరిబాబు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

అల్లవరం, ఫిబ్రవరి 18: ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంపీ చింతా అనురాధ అన్నారు. బెండమూర్లంక నుంచి ఓడలరేవు వరకూ చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను ఆమె ఆదివారం పరిశీలించారు. గడువులోగా పనులు పూర్తిచేయాలన్నారు.

టేకు చెట్టు మాయం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 18: ముమ్మిడివరం మార్కెట్ యార్డులో 40ఏళ్ల నాటి రూ.5లక్షల విలువైన టేకు చెట్టు మాయమైంది. మార్కెట్ యార్డులో పనిచేసి బదిలీపై వెళ్లిన అధికారి చిరుద్యోగుల ద్వారా టేకు చెట్టును కట్ చేయించి తరలించుకుపోయినట్టు సమాచారం. దీనిపై కొందరు విజిలెన్సు అధికారులకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

పినపళ్లలో గడపగడపకు..

ఆలమూరు, ఫిబ్రవరి 18: పినపళ్లలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. నాలుగున్నరేళ్లలో ఆయా గృహాలకు ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిపత్రాలను అందించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.